# సిరియాపై అమెరికా సామ్రాజ్యవాద
# సైనిక దాడిని ఖండించండి

**అంతర్జాతీయ** న్యాయసూత్రాలను ఘోరంగా ఉల్లంఘిస్తూ, సిరియాపై పూర్తిస్థాయి యుద్ధాన్ని ప్రారంభించే రెచ్చగొట్టే చర్యగా అమెరికా సామ్రాజ్యవాదం సిరియాపై సాగించిన క్షిపణి దాడులను సిపిఐ(ఎం.ఎల్) కేంద్రకమిటీ తీవ్రంగా ఖండిస్తోంది.

అసద్ ప్రభుత్వ సైనిక బలగాలు సిరియా వాయవ్యభాగంలోని ఇడ్లిబ్ రాష్ట్రంలో రసాయన ఆయుధాలను ఉపయోగించాయనే ముందస్తు ఆరోపణ, కల్పితమైనదనేది నిస్సందేహం. జనహనన ఆయుధాలను ఉపయోగించాయనే ఇదే తరహా కల్పిత ఆరోపణలతో సెర్బియా(1999), ఆఫ్ఘనిస్తాన్(2001), ఇరాక్(2003), లిబియా(2011)లపై దురాక్రమణ యుద్ధాలకు అమెరికా పాల్పడింది. పైన పేర్కొన్న వివిధ దేశాలలో సాగిన ఘటనల క్రమమంతా అమెరికా సామ్రాజ్యవాదం మరియు దాని మిత్రకూటమి దేశాలయొక్క ముందస్తు పథకాలలో భాగమేనని సిరియాపై ఆరోపణలు చేసిన సమయం, అంతేవేగంగా ప్రతీకార దాడులుగా చెప్పబడుతున్న ఈ వైమానిక దాడులూ స్పష్టంగా తెలియజేస్తున్నాయి.

మధ్యప్రాచ్యంలో కార్యకలాపాలు సాగిస్తోన్న అమెరికా గూఢచార సంస్థలే సరైన్, క్లోరిన్‌వంటి విషపూరిత వాయువులను టెర్రరిస్టు సంస్థలకు సరఫరాచేస్తున్నాయని, వాటిని ఉపయోగించేందుకు శిక్షణనిస్తున్నాయని ఐక్యరాజ్యసమితికి చెందిన రసాయన ఆయుధ నిరోధ సంస్థతోసహా పలు దర్యాప్తు సంస్థలు వెల్లడించాయి. సిఐఏ ద్వారా ఆర్థికం, ఆయుధాలు, శిక్షణ పొందుతున్న తిరుగుబాటుదారులుగా పేర్కొనబడుతున్న వారు – అసద్ ప్రభుత్వ సైనిక బలగాలపై 2013లో ఇదే తరహాలో చేసిన ఆరోపణలన్నీ కల్పితమైనవేనని ఆ తర్వాత రుజువైంది.

శాంతికాముక ప్రజానీకమంతా సిరియాపై అమెరికా వైమానిక దాడులను ఖండించాలని, పెద్దఎత్తున యుద్ధవ్యతిరేక ఉద్యమాన్ని నిర్మించాలని పిలుపునిస్తున్నాము.

ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికా దేశాలలో జాతులను, ప్రజలను దోచుకునేందుకు, అణచివేసేందుకు, ప్రపంచంపై తన ఆధిపత్యాన్ని దృఢతరం చేసుకోవటంలో భాగంగా అమెరికా సామ్రాజ్యవాదం మధ్యప్రాచ్యంలో యుద్ధాలను తీవ్రం చేస్తూ, రక్తపాతం సృష్టిస్తోన్న చర్యలను ప్రజానీకం తీవ్రంగా ఖండించాలని పిలుపునిస్తున్నాము.

**విశ్వం**
ప్రధానకార్యదర్శి
**సిపిఐ(ఎం.ఎల్), కేంద్రకమిటి**

**కోల్‌కత**
**9-4-17**

ooooo